

రాత్రిపూట డీజేల హోరు

ఫాంహౌస్‌లో డీజేల హోరు మార్మోగుతోంది. భయంకరమైన ఈ శబ్దాలకు ఫారంలోని కోళ్లు మృత్యువాత పడ్డాయి. 8లో▸



వ్యతిరేక విధానాలపై పోరు

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై రాజీలేని పోరు తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య హెచ్చరించారు. 8లో▸



చేవెళ్ల అభివృద్ధికి కృషి

చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూనే ఉంటామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రకటించారు. 8లో▸

న్యూస్‌రీల్

గురుకులాల్లో ప్రవేశాలకు గడువు పెంపు

షాద్‌నగర్‌రూరల్: గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రభుత్వం గడువు పెంచిందని కమ్మదనం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర సాంఘీక సంక్షేమ గురుకులాల్లో 5 నుంచి 9వ తరగతి ప్రవేశాల కోసం ఈ నెల 1 వరకు అవకాశం ఉండగా ఈ నెల 6 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో 5వ తరగతి, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతి, గౌలిదొడ్డి, అలుగునూరు సీఓఈలో 9వ తరగతి, ఖమ్మం, పరిగి ఎస్ఓఈలో 8వ తరగతి రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్‌గిరి ఫైన్‌ఆర్ట్స్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. విద్యార్థులు రూ.100 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గురుకులాల ప్రవేశ పరీక్షకు కులం, ఆదాయం, ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్, ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 23 ఫిబ్రవరి 2025న నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అవకాశాన్ని ఆసక్తి కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్మికులతో సమావేశమైన సీఐటీయూ నాయకులు

చేవెళ్ల: మున్సిపల్ కార్మికులకు జీఓ నం. 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీలోని కార్మికులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయటంతోపాటు పర్మినెంట్ చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్, అమలు చేయాలని, బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. మున్సిపల్ కార్మికులకు యూనిఫామ్స్ గుర్తింపు కార్డులు అందించాలని, విద్యార్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలని కోరారు. 30 ఏళ్లుగా కార్మికులు పారిశుద్ధ్య పనులు చేస్తున్నారని, వారి శ్రమను ప్రభుత్వం గుర్తించి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఎలాంటి సమస్యలు వచ్చినా సీఐటీయూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎల్లయ్య, నరేశ్, దస్తగిరి, జనార్దన్, నర్సింహ, కిష్టయ్య, బుచ్చయ్య, చేసమ్మ వెంకటయ్య, మల్లమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన త్యాగరాజ ఆరాధన సంగీతోత్సవం

మాదాపూర్: గాత్ర కచేరీతో గురుకుల విద్యార్థులు శ్రోతలను విశేషంగా ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ త్యాగరాజ ఆరాధన సంగీతోత్సవం ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమాల్లో భాగంగా దేశ విదేశాలకు చెందిన 600 మంది సంగీత కళాకారులు శిల్పారామంలోని సంప్రదాయ వేదికలో కలిసికట్టుగా త్యాగరాజ స్వామి ఘనరాగ పంచరత్న కీర్తనలను ఆలపించారు. సంస్కృతి ఫౌండేషన్ ప్రసిద్ధ కర్ణాటక వయోలిన్ విద్వాంసులు నాద సుదర్శవ పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామిని గురుసన్మానంతో గౌరవించుకున్నారు. కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొని సంస్కృతి ఫౌండేషన్ తరపున గండపెండేరాన్ని బహూకరించారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, పద్మశ్రీ ఎల్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు



దుద్యాల్: వానరానికి అంత్యక్రియలు చేసిన ఘటన మండలంలోని హస్నాబాద్‌లో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నాయికోటి కుటుంబ సభ్యులు సాయప్ప, వెంకటప్ప, శేఖర్, ఆరుణ్‌కు గ్రామ శివారులో పొలం ఉంది. ఉదయం వారు పొలానికి వెళ్లగా చెట్టు కింద వానరం కళేబరం కనిపించింది. దీంతో వారు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు.

జలం.. పాతాళం!

- జిల్లాలో వేగంగా పడిపోతున్న భూగర్భ జలమట్టం
- డిసెంబర్‌తో పోలిస్తే జనవరిలో మరింత లోతుకు
- ఇప్పటికే ఆగిపోస్తున్న వ్యవసాయ మోటార్లు
- పల్లెల్లో అప్పుడే మొదలైన తాగునీటి ఎద్దడి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: భూగర్భజలాలు జిల్లాలో వేగంగా పడిపోతున్నాయి. గత డిసెంబర్‌లో సగటు భూగర్భ జలమట్టం ఆనవాళ్లు 9.08 మీటర్ల లోతులో కన్పించగా తాజాగా 10.13 మీటర్ల లోతుకు (1.05 మీటర్ల లోతుకు) పడిపోయాయి. వేసవి ప్రారంభానికి ముందే వ్యవసాయ బోర్లు ఆగిపోస్తుండగా గృహ, వాణిజ్య సంస్థల్లో అప్పుడే నీటికి కటకట మొదలైంది. ముఖ్యంగా నిర్మాణాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం పాతాళానికి పడిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. జిల్లావ్యాప్తంగా 87 ఫీజో మీటర్లు ఉండగా ఇబ్రహీంపట్నంలో 15.75 మీటర్ల లోతుకు పడిపోతే.. సరూర్‌నగర్‌లో 14.80 మీటర్లు, శేరిలింగంపల్లిలో 13.97 మీటర్ల లోతుకు చేరడం గమనార్హం. నందిగామ, ఆమనగల్లు, అబ్దుల్లాపూర్‌మెట్‌లో నీటి ఆనవాళ్లు ఆశించిన దానికంటే పైనే కన్పిస్తుండడం విశేషం.



పల్లెల్లో మొదలైన కటకట

చెరువులు, కుంటలు ధ్వంసం చేయడం, నీటి ప్రవాహానికి అడ్డుకట్టలు వేయకపోవడం, కొండలు, గుట్టలను చదును చేస్తుండటం, చెట్లను నరికివేస్తుండటం, గేటెట్ కమ్యూనిటీలు, విల్లాలు, ఫాంహౌస్‌లు, పరిశ్రమల పేరుతో భారీగా నిర్మాణాలు చేపడుతుండటం భూగర్భ జలాలు వేగంగా పడిపోతుండటానికి కారణమవుతున్నాయి. ఇంటి చుట్టూ రోడ్డు, ఇతర అవసరాల కోసం కాంక్రీట్ వేస్తుండటం, వర్షపు నీరు భూమిలోపలికి ఇంకేందుకు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయకపోవడం, పంట పొలాల్లోనే కాదు గృహ, వాణిజ్య సముదాయాల్లోనూ అవసరానికి మించి నీటిని వినియోగిస్తుండడం కూడా కారణమవుతున్నాయి. గ్రామాల్లోని బోర్లు కూడా సరిగా పోయడం లేదు. అవసరాల మేరకు నీరు సరఫరా కావడం లేదు. గత నెల వరకు ప్రతి రోజూ నల్లాల్లో నీరు వచ్చేది. తాజాగా రోజు విడిచి రోజు వదులుతుండటమే ఇందుకు నిదర్శనం.

వివిధ మండలాల్లో భూగర్భ జలమట్టం .. (మీటర్ల లోతులో..)		
మండలం	డిసెంబర్	జనవరి
ఇబ్రహీంపట్నం	14.11	15.75
సరూర్‌నగర్	12.66	14.80
శేరిలింగంపల్లి	12.59	13.97
తలకొండపల్లి	12.43	12.98
హయత్‌నగర్	10.95	12.44
మంచాల	10.29	11.96
షాబాద్	9.19	11.45
గండిపేట్	9.87	10.08
కడ్తాల్	9.76	10.58
చేవెళ్ల	9.14	10.23
మహేశ్వరం	9.74	10.09
శంకర్‌పల్లి	8.45	9.77
కొత్తూరు	8.37	9.41
చౌదరిగూడెం	7.86	9.17
శంషాబాద్	8.36	8.80
రాజేంద్రనగర్	8.33	8.76
మొయినాబాద్	7.87	8.76
యాచారం	8.07	8.74
మాడ్గుల	7.24	7.54
కందుకూరు	6.72	7.69
బాలాపూర్	6.73	7.17
ఫరూఖ్‌నగర్	6.84	7.08
కేశంపేట	4.69	5.48
కొందుర్గు	4.92	6.42
అబ్దుల్లాపూర్‌మెట్	5.41	6.17
ఆమనగల్లు	5.30	6.06
నందిగామ	4.90	4.70

మోటార్లు ఆగిపోస్తున్నాయి



వ్యవసాయ బోరు కింద నాలుగు ఎకరాల వరి సాగు చేశాను. అప్పుడే మోటార్లు ఆగిపోస్తున్నాయి. వేసవికి ముందే బోర్లు ఆగిపోస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. చివరి మడి వరకు తడుస్తుందా అంటే అనుమానమే. వేసిన పంట చేతికందకుండా పోయే అవకాశం ఉంది. పెట్టిన పెట్టుబడి కూడా రాకుండా పోతుంది.

– కె.శంకర్‌నాయక్, కొర్రంతండా, మంచాల

అప్పుడే నీటి ఎద్దడి



ఏ ఇంటి చుట్టూ చూసినా సీసీ రోడ్లే. వర్షపు నీరు భూమిలోకి ఇంకని దుస్థితి. ప్రతి ఇంటి ముందు ఓ ఇంకుడుగుంత ఏర్పాటు చేసుకోవాల్సి ఉన్నా చాలా మంది ఈ అంశాన్ని పట్టించుకోవడం లేదు. పూర్తిగా కాంక్రీట్ జంగిల్‌గా మారింది. సాధారణంగా ఏప్రిల్, మేలో కన్పించే నీటి ఎద్దడి ఫిబ్రవరి మొదటి వారంలోనే కన్పిస్తోంది.

– డి.ఆంజనేయులు, హస్తినాపురం



చిలుకా.. క్షేమమా!

అరుదైన రామచిలుకలు.. ఆసక్తిగొలిపే పక్షులు.. అపురూపమైన పెంపుడు శునకాలు.. సరదాగొలిపే పిల్లులు.. చిన్నారులను అమితంగా ఆకట్టుకున్నాయి. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన పెటెక్స్, కిడ్స్ ఎక్స్‌పో, కిడ్స్ బిజినెస్ ఎక్స్‌పో ఆదివారం ముగిసింది. సెలవు రోజు కావడంతో సందర్శకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

– మాదాపూర్



గన్.. సవాల్!

బిహార్, యూపీ నుంచి సిటీకి అక్రమ ఆయుధాలు

నేరగాళ్ల చేతికి చేరుతుండటమే పెను సవాల్	అఫ్జల్‌గంజ్‌లో కాల్పులు జరిపిన బీదర్ గ్యాంగ్	గచ్చిబౌలిలో విరుచుకుపడిన బత్తుల ప్రభాకర్	నిఘా నిద్రపోవడమే ఇందుకు ప్రధాన కారణం

- 15.01.2025: ఉత్తరప్రదేశ్‌కు చెందిన హరేకృష్ణ బిహార్ నుంచి మూడు తుపాకులు, పది బుల్లెట్లు ఖరీదు చేసుకుని నగరానికి చేరుకున్నాడు. ఇక్కడి నేరగాళ్లకు విక్రయించే ప్రయత్నాల్లో రాచకొండ ఎస్వోటీ పోలీసులకు చిక్కాడు.
- 16.01.2025: కర్ణాటకలోని బీదర్‌లో ఎస్‌బీఐ ఏటీఎం మిషన్లలో నగదు నింపే సీఎంఎస్ ఏజెన్సీ వాహనంపై బిహార్ దొంగలు విరుచుకుపడ్డారు. అక్కడ రూ.87 లక్షలు దోచుకుని అఫ్జల్‌గంజ్ చేరుకుని, ట్రావెల్స్ మేనేజర్ జహంగీర్‌పై కాల్పులు జరిపారు.
- 01.02.2025: తెలుగు రాష్ట్రాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న నేరగాడు బత్తుల ప్రభాకర్ గచ్చిబౌలిలో సైబరాబాద్ సీసీఎస్ పోలీసులపై కాల్పులు జరిపాడు. ఇతడి నుంచి పోలీసులు ఏకంగా మూడు తుపాకులు, 451 తూటాలు స్వాధీనం చేసుకున్నారు.
- బిహార్, ఉత్తరప్రదేశ్ సహా ఉత్తరాది నుంచి నగరానికి వస్తున్న ఆయుధాలకు సంబంధించి తాజా ఉదాహరణలివి. ఈ ఆయుధాలతోపాటు ఆ దందాలు చేసేవారిపైనా పూర్తి స్థాయిలో నిఘా ఉండటం లేదు. ఫలితంగా ఎక్కడపడితే అక్కడ నాటు తుపాకులు లభిస్తున్నాయి. దీంతో నేరగాళ్లు వీటిని వినియోగిస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. గచ్చిబౌలిలో కాల్పులు జరిపిన బత్తుల ప్రభాకర్‌కు ఘరానా నేర చరిత్ర ఉంది. అయితే అతడు ఆయుధం వినియోగించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

– సాక్షి, సిటీబ్యూరో

నాటు ఆయుధాల ధరలు ఇలా..

తపంచా: రూ.5 వేల నుంచి రూ.8 వేలు
రివాల్వర్: రూ.25 వేల నుంచి రూ.50 వేలు
పిస్టల్: రూ.30 వేల నుంచి రూ.60 వేలు
ఆటోమేటిడ్ పిస్టల్: రూ.80 వేలకు పైగా..
ఆటోమేటిడ్ రివాల్వర్: రూ. 90 వేలకు పైగా
(విశ్వసనీయ సమాచారం ప్రకారం)

అక్రమ ఆయుధాలన్నీ అక్కడి నుంచే..

బిహార్, ఉత్తరప్రదేశ్‌లోని అనేక ప్రాంతాల్లో తుపాకుల తయారీ ఓ కుటీర పరిశ్రమగా సాగుతోంది. నగరానికి సరఫరా అవుతున్న నాటు తుపాకుల్లో దాదాపు 90 శాతం ఈ ప్రాంతాల నుంచి 'దిగుమతి' చేసుకుంటున్నవే. బిహార్‌లోని గయ ప్రాంతంలో తయారవుతున్న నాటు తుపాకులు సేఫ్టీ లాక్‌తో రూపొందుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. కేవలం కంపెనీ మేడ్ రివాల్వర్స్, పిస్టల్స్‌కు మాత్రమే ఈ సౌలభ్యం ఉంటుంది. బిహార్ నుంచి నగరానికి సరఫరా అవుతున్న వాటిలో ఆటోమేటెడ్, సెమీ–ఆటోమేటెడ్ రకాలు ఉంటున్నాయనేది ఆందోళన కలిగించే అంశం. .32 లాంటి క్యాలిబర్స్ మాత్రమే కాకుండా... కేవలం డిఫెన్స్, పోలీసు శాఖలు మాత్రమే వాడే ప్రొహిబిటెడ్ బోర్‌గా పిలిచే



.9 ఎంఎం తుపాకులు, తూటాలు నాటు పద్ధతిలో తయారవుతున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కేవలం రివాల్వర్లు, పిస్టల్లు మాత్రమే కాదు.. వీటితో పాటు డబుల్ బ్యారెల్, సింగిల్ బ్యారెల్ తుపాకులు సైతం బిహార్ ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చి చేరుతున్నాయని తెలుస్తోంది.

ప్రత్యేక ముఠాలతో అక్రమ రవాణా..

- నగరానికి ఆయా రాష్ట్రాల నుంచి తుపాకులు సరఫరా చేయడానికి ప్రత్యేక ముఠాలు పని చేస్తున్నాయి. అక్కడి కరడుగట్టిన ముఠాలు వీటిని అందిస్తున్నాయి. వీరికి రైలు మార్గం ఓ వరంగా మారింది. జనరల్ బోగీల్లో తనిఖీలు అంతంత మాత్రంగా ఉండటంతో వీటిలోనే ఆయుధాలు రవాణా చేస్తున్నాయి. వీటికి తోడు ట్రాన్స్‌పోర్ట్ లారీలు, కొన్నిసార్లు ప్రైవేట్ బస్సుల్లోనూ ఇవి నగరానికి వస్తున్నాయి. ఓ పక్క ముఠాలే కాకుండా.. అక్కడి నుంచి వచ్చే దినసరి కూలీలు సైతం ఆయుధ వ్యాపారాన్ని అదనపు ఆదాయ మార్గంగా భావిస్తున్నారు.
- పనుల కోసం నగరంలో స్థిరపడిన బిహారీలు రాకపోకలు సాగించే సమయంలో తమతో పాటు కొన్ని ఆయుధాలు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. పాతబస్తీతో పాటు శివార్లలో ఉన్న అనేక ప్రాంతాల్లో వీటిని విరివిగా విక్రయిస్తున్నారు. ఈ ఆయుధాల సరఫరా మూలాలను కనుక్కోవడంలో పోలీసు నిఘా అంతంత మాత్రంగానే ఉందని చెప్పవచ్చు. ఓ ముఠా దొరికినప్పుడు వారిని అరెస్టు చేయడంతో సరిపెట్టాల్సి వస్తోంది. ఎవరైనా చొరవ తీసుకుని కాస్త ముందడుగు వేసి దర్యాప్తు కోసం రాష్ట్రం దాటినా.. వారికి అక్కడి పోలీసుల నుంచి సరైన సహకారం అందుతుందని ఆశించలేం. ఒక్కోసారి ఎదురుదాడులు జరిగే పరిస్థితి ఉంది. బిహార్, ఉత్తరప్రదేశ్‌ల్లో ఈ పరిస్థితులు మరీ ప్రమాదకరంగా ఉంటాయి. ఈ నేపథ్యంలోనే ఆసక్తి ఉన్న అధికారులు సైతం మిన్నకుండిపోవాల్సి వస్తోంది.

లక్ష్యం.. శతశాతం



ఇబ్రహీంపట్నం/తుక్కుగూడ: మున్సిపాలిటీల్లో వందశాతం పన్నులు వసూలు చేయాలన్న లక్ష్యంతో అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరం ముగియడానికి గడువు సమీపిస్తుండడంతో స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టి టార్గెట్ పూర్తి చేయాలని భావిస్తోంది. మూడునాలుగేళ్లుగా మున్సిపాలిటీలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆదాయ వనరులు తగ్గాయి. సిబ్బంది జీతభత్యాలు, అభివృద్ధి పనులకు డబ్బులు కావాలంటే భవన నిర్మాణాల అనుమతులు, బెటర్‌మెంట్ చార్జీలు, వాణిజ్య దుకాణాల లైసెన్స్ చార్జీలతో పాటు వివిధ పన్నుల రూపేనా వచ్చే ఆదాయంపై ఆధారపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి పూర్తిస్థాయి పన్నులు వసూలు చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి వసూళ్లు చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఇంటింటికీ, వ్యాపార, వాణిజ్య సముదాయాలకు, విద్యాసంస్థల వెంట తిరుగుతూ పన్నులు వసూలు చేయాల్సిన బాధ్యత వారికి అప్పగించారు. మొండి బకాయిదారుల నుంచి పన్నులు రాబట్టేందుకు నోటీసులు అందజేస్తున్నారు. పన్నులు చెల్లించకుంటే ఆయా భవనాలను సీజ్ చేసేందుకు వెనుకాడమని హెచ్చరిస్తున్నారు.

'పట్నం' మున్సిపల్ పరిధిలో..

పన్నుల వసూళ్లలో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ వెనుకబడింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి టార్గెట్ రూ.13.09 కోట్లు కాగా అందులో పాత బకాయిలే రూ.6.55 కోట్లు ఉన్నాయి. ఇప్పటి వరకు రూ.2.91 కోట్లు మాత్రమే రాబట్టగలిగారు. మున్సిపాలిటీలో గృహ, వాణిజ్య, వ్యాపార, విద్య, వైద్య, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల కార్యాలయాలకు సంబంధించి సుమారు 7,239 భవనాలకు పన్నులు వసూలు చేయాల్సి ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రావాల్సిన పన్నులు పక్కన పెడితే ఇతర మార్గాల ద్వారా సుమారు రూ.6 కోట్ల పన్నులు మార్చి 31 ముగిసేలోపు రాబట్టాల్సి ఉంది.

తుక్కుగూడ పరిధిలో..

మున్సిపల్ పరిధిలోని తుక్కుగూడ, రావిర్యాల, మంఖాల్, ఇమామ్‌గూడ, దేవేందర్‌నగర్‌కాలనీ, సర్దార్‌నగర్ తదితర ప్రాంతాల్లో 7,098 గృహాలు, 285 వాణిజ్య, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. వీటి ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.6.72 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను వసూళ్లలో లక్ష్యాన్ని అధిగమించేందుకు అధికారులు బిల్ కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. ఇప్పటి వరకు రూ.3 కోట్లకు పైగా (52 శాతం) వసూలు చేశారు. మిగిలిన మొత్తం వసూలు చేయడానికి పుర ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఆటో వాహనానికి మైక్ ఉంచి ప్రతి వార్డులో చాటింపు వేస్తున్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీకి పుర ప్రజల నుంచి ఆదాయ పన్ను కాకుండా ఫ్యాబ్‌సిటీ– హార్డ్‌వేర్ పార్కు, మంఖాల్ పారిశ్రామిక వాడ తదితర పరిశ్రమల వద్ద టీఎస్ఐడీఎస్ వసూలు చేసిన ఆదాయ పన్నులో 40 శాతం మేరకు అందజేస్తారు. గత ఏడాది 92 శాతం ఆదాయ పన్నును అధికారులు వసూలు చేశారు.

సకాలంలో చెల్లించాలి



పన్నులు చెల్లిస్తేనే మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతుంది. మున్సిపాలిటీ అభ్యున్నతికి సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలి. లేకుంటే మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు చేపడతాం. కేంద్ర, రాష్ట్ర సంస్థల పన్నులు మినహాయిస్తే ఈ ఏడు వందశాతం టార్గెట్ పూర్తి చేస్తాం.


– రవీంద్రసాగర్, కమిషనర్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ

అవగాహన కల్పిస్తున్నాం



మున్సిపాలిటీలో ఆదాయ పన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా పన్ను చెల్లింపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. 100 శాతం వసూలు లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ప్రతి ఒక్కరూ ఆస్తి పన్ను చెల్లించి, పుర అభివృద్ధికి సహకరించాలి.

– టి.పర్వతాలు మేనేజర్, తుక్కుగూడ మున్సిపాలిటీ



సరస్వతీ దేవి అలంకరణలో

భాగ్యలక్ష్మి అమ్మవారు

వసంత పంచమి వేడుకలను పురస్కరించుకొని చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వసంత పంచమి సందర్భంగా సోమవారం చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయాన్ని వివిధ రకాల పూలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు అమ్మవారి దర్శనం కోసం క్యూ కట్టారు.

– చార్మినార్

డామిట్.. కథ అడ్డం తిరిగింది!

- కూతురును ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కించాలని తల్లి డ్రామా
- చైన్ స్నాచింగ్ అంటూ డయల్ 100కు ఫోన్
- దర్యాప్తులో అంతా అబద్ధమేనని తేల్చిన పోలీసులు
- నిందితురాలిపై చర్యలకు సిద్ధమవుతున్న వైనం

ఘట్‌కేసర్: కూతురును ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కించాలని ఓ తల్లి ఆడిన డ్రామాను ఘట్‌కేసర్ పోలీసులు ఛేదించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్ గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలి (60) కూతురు ఆర్థిక సమస్యల్లో ఉంది. కూతురు పడుతున్న కష్టాలను గమనించిన తల్లి.. ఏదైనా సాయం చేయాలనుకుంది. తన దగ్గర డబ్బు లేకపోవడంతో పుస్తెల తాడు విక్రయించాలనుకుంది. బంగారం అమ్మితే కుమారుడికి తెలుస్తుందని భయపడి మిన్నకుండిపోయింది. ఎలాగైనా కూతురికి సాయం చేయాలని చైన్ స్నాచింగ్ డ్రామాకు తెరలేపింది. ఆదివారం ఉదయం ఇంటి నుంచి మెయిన్ రోడ్డుకు చేరుకొని తన మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారని ఏడ్వసాగింది. దీంతో పలువురు స్థానికులు అక్కడ గుమికూడారు. ఈ క్రమంలో వృద్ధురాలు డయల్ 100కు ఫోన్ చేసింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, నలుగురు ఎస్సైలు పోలీస్ సిబ్బందితో కలిసి నాలుగు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు అడిగిన ప్రశ్నలకు వృద్ధురాలు పొంతన లేని సమాధానాలు చెప్పింది. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించగా దుండగుల ఆచూకీ లభించలేదు. దీంతో వృద్ధురాలిని గట్టిగా నిలదీయడంతో.. కూతురిని ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కించాలని డ్రామా ఆడినట్లు తెలిపింది. కూతురి ఆర్థిక సమస్యలు తీర్చాలని పోలీసులను తప్పుదోవ పట్టించిన వృద్ధురాలిపై చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. అత్యవసర సమయాల్లో వినియోగించే డయల్ 100ను దుర్వినియోగపర్చవద్దని పోలీసులు సూచించారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరు

- పేదలను విస్మరించిన కేంద్ర బడ్జెట్
- సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య


కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

యాచారం: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై రాజీలేని పోరు తప్పదని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య హెచ్చరించారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో పేదలకు ఎలాంటి ఊరట దక్కలేదన్నారు. కేవలం బడా పారిశ్రామికవేత్తలకే ప్రయోజనం చేకూర్చేలా ఉందని నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం యాచారంలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద సాగర్‌రోడ్డుపై రాస్తారోకో నిర్వహించి కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రైతులు, కార్మికులు, పేదలకు ఏ మాత్రం ఉపయోగం లేని విధంగా ఉందని మండిపడ్డారు. కేంద్రంలో మూడు దఫాలుగా అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వంతో పేదలకు ఒరిగిందేమి లేదన్నారు. రైతాంగానికి, కార్మికులకు వ్యతిరేకంగా చట్టాలు తెస్తూ మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, నాయకులు అంజయ్య, బ్రహ్మయ్య, జంగయ్య, చందునాయక్, జగన్, వినోద్, లాజర్, విప్లవ్‌కుమార్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల అభివృద్ధికి నిరంతరం కృషి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి
- జన్వాడలో బీఆర్‌ఎస్‌లోకి చేరికలు


వెంకటేశ్‌కి కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

శంకర్‌పల్లి: చేవెళ్ల గడ్డ అభివృద్ధి కోసం నిరంతరం కొట్లాడుతూనే ఉంటాయని ఆనాడే స్వర్గీయ పి.ఇంద్రారెడ్డి స్పష్టం చేశారని, ప్రస్తుతం అదే బాటలో తాము నడుస్తున్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రకటించారు. ఆదివారం శంకర్‌పల్లి మండలం జన్వాడలో మాజీ వార్డు సభ్యుడు వెంకటేశ్ తన అనుచరులు దాదాపు 500మందితో కలిసి మాజీ మంత్రి సబితారెడ్డి, కార్తీక్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకి జన్వాడవాసులు పూలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. సబితారెడ్డి మాట్లాడుతూ.. జన్వాడ గ్రామం తన ఊరని ఎప్పుడూ స్వర్గీయ ఇంద్రారెడ్డి చెప్పుకొనే వారని గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాటల్లో చెప్పే అభివృద్ధి చేతల్లో కనిపించడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాట్లాడే అవకాశం వచ్చిన ప్రతిసారి మాజీ సీఎం కేసీఆర్‌ని దూషించి కాలాన్ని వృథా చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 58 మంది విద్యార్థులు, పదుల సంఖ్యలో పోలీసులు ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకపోవడం బాధాకరమన్నారు. జన్వాడ గ్రామాన్ని ఎవరి అనుమతి లేకుండా మున్సిపాలిటీలో కలపడం ఏంటని, దీనిపై కోర్టులో కేసు వేసి, పోరాటం చేస్తానని, ఎవరూ అధైర్యపడొద్దని భరోసానిచ్చారు. బీఆర్‌ఎస్ నేత కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఒక్క సంవత్సరంలోనే కాంగ్రెస్ పాలనపై ప్రజలకు విరక్తి వచ్చిందని, మళ్లీ కేసీఆర్‌యే సీఎం కావాలని ప్రజలకు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, నాయకులు నాగేందర్ గౌడ్, ఆంజనేయులు, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్, నరసింహ, నాగేందర్, గోపాల్, అశోక్, రాములు తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులు తాళలేక..

మహిళ ఆత్మహత్య

ఉప్పల్: వరకట్న వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రి జిల్లా, మోత్కూరు మండలం, పాటిమట్ల గ్రామానికి చెందిన భోరెడ్డి రాజశేఖర్ రెడ్డికి గుండాల మండలం, సీతారాంపురం గ్రామానికి చెందిన మలిపెద్ది రవళి(25)తో 2019లో వివాహం జరిగింది. బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చిన వారు ఉప్పల్‌లోని చిలుకానగర్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత కొన్నేళ్లుగా రవళిని అత్తమామలు, ఆడబిడ్డలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. పలు మార్లు పెద్ద మనుషులు జోక్యం చేసుకుని నచ్చజెప్పినా వారి వైఖరి మారలేదు. ఏడాది క్రితం రాజశేఖర్ రెడ్డి భార్యను వదిలేసి స్వగ్రామానికి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి రవళి ఒంటరిగా ఉంటోంది. ఈ నేపథ్యంలో మనస్తాపానికి లోనైన ఆమె శనివారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. వరకట్న వేధింపుల కారణంగానే తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి రజిత ఉప్పల్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గత కొంత కాలంగా పిల్లలిద్దరూ తండ్రి వద్దనే ఉంటున్నట్లు సమాచారం.


రవళి (ఫైల్)

చికిత్స పొందుతూ.. వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ బలరాం కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తి(55) జనవరి 24న ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట శివారులో స్పృహ తప్పి పడిపోయాడు. విషయాన్ని తెలుసుకున్న స్థానికులు 108 అంబులెన్స్‌లో షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొదుతున్న వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. పోలీసులు మృతుడి ఆచూకీ కోసం ప్రయత్నించినా వివరాలు తెలియరాలేదు. మృతుడి ఒంటిపై బూడిద రంగు షర్టు, బ్రౌన్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. కుడి చేతికి దారం కట్టుకున్నాడు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. ఆచూకీ తెలిసిన వారు 8712663329, 8712568289 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.


గుర్తు తెలియని మృతదేహం

పోష్ పబ్‌లో తనిఖీలు

కాలం చెల్లిన ఆహార పదార్థాల గుర్తింపు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-36లోని పోష్ నోష్ పబ్‌తో పాటు కిష్కింధ కిచెన్ హోటల్‌లో ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా కిచెన్‌లో అపరిశుభ్ర వాతావరణాన్ని గుర్తించిన అధికారులు కాలం చెల్లిన ఆహార పదార్థాలను, నిత్యావసర సరుకులను సీజ్ చేశారు. రిఫ్రిజిరేటర్లు కూడా శుభ్రంగా లేవని తెలిపారు. మంచి నీటి నాణ్యతా నివేదికలు, చెదల నివారణ రికార్డులను కూడా చూపించలేదు. కిచెన్‌లో బొద్దింకలు తిరుగుతున్నట్లుగా నిర్ధారించారు. నిర్వాహకులపై కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అగ్ని ప్రమాదంలో యువకుడి మృతి

బాలానగర్: బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజమండ్రికి చెందిన సాయి సత్య శ్రీనివాస్ (30) రెండేళ్లుగా దాసరి సంజీవయ్య కాలనీలోని ఓ ఇంట్లో నివాసం ఉంటూ పటాన్‌చెరు ప్రాంతంలోని కెమికల్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు ఇంట్లో నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. మంటల్లో చిక్కుకున్న శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఇన్‌స్పెక్టర్ నరసింహ రాజు తెలిపారు.

రాత్రిపూట డీజేల హోరు

- శబ్దాలకు మృత్యువాత పడిన కోళ్లు
- ఫాంహౌస్‌లలో పెచ్చుమీరుతున్న వింత ధోరణి


డీజే శబ్దాలకు మృతి చెందిన కోళ్లు

మొయినాబాద్: ఫాంహౌస్‌లో రాత్రి సమయంలో డీజేల హోరు మార్మోగుతుంది. భయంకరమైన ఈ శబ్దాలకు ఫారంలోని కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సురంగల్‌లో శనివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సురంగల్ రెవెన్యూలోని బ్రిడ్జ్ ఫాం వెంచర్‌లోని ఓ ఫాంహౌస్‌లో నిత్యం ఈవెంట్లు, పార్టీలు జరుగుతున్నాయి. సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు రాత్రంతా డీజేలతో హోరెత్తిస్తారు. శనివారం రాత్రి సైతం ఫాంహౌస్‌లో పార్టీ నిర్వహిస్తూ డీజే సౌండ్ ఏర్పాటుచేశారు. భయంకరమైన శబ్దాలకు ఫాంహౌస్ పక్కన ఉన్న గడ్డం వెంకట్‌రెడ్డి ఫాంలో పెంచుతున్న కోళ్లు మృత్యువాతపడ్డాయి. సుమారు వంద కోళ్లకు పైగా మృతి చెందడంతో తీవ్ర నష్టం జరిగిందని బాధితుడు లబోదిబోమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మామూళ్ల మత్తులో పోలీసులు

మొయినాబాద్ ప్రాంతంలో వందల సంఖ్యలో ఫాంహౌస్‌లు ఉన్నాయి. ప్రతి రోజు ఫాంహౌస్‌ల్లో ఈవెంట్లు, పార్టీలు, వేడుకలు జరుగుతూనే ఉంటాయి. అయితే ఫాంహౌస్‌లో జరిగే పార్టీలు, ఈవెంట్లలో డీజేలు పెట్టడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఇప్పటికే చాలా గ్రామాల ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ ఆ ఫిర్యాదులను పోలీసులు చెత్తబుట్టలో పడేస్తున్నారు. ఎప్పుడైనా పెద్ద ఘటన జరిగితే నిర్వాహకులపై చిన్న పెట్టి కేసు పెట్టి వదిలేస్తున్నారు. ఫాంహౌస్‌ల నుంచి పోలీసులకు అందుతున్న మామూళ్లే దీనికి ప్రధాన కారణం అనే ఆరోపణలున్నాయి. రాత్రి సమయంలో పెట్రోలింగ్ చేసే పోలీసులు ఫాంహౌస్‌లకు వెళ్లి అక్కడ ఎలాంటి ఈవెంట్లు, పార్టీలు, వేడుకలు జరిగినా రూ.వేలల్లో వసూలు చేస్తున్నారని సమాచారం. ఇందులో ఉన్నతాధికారులకు సైతం వాటాలు వెళ్తున్నట్లు తెలుస్తుంది. అందుకే ఫాంహౌస్‌లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా, అనుమతి లేకుండా డీజేలు, లిక్కర్ వినియోగిస్తున్నా స్థానిక పోలీసులు పట్టించుకోవడంలేదు. ఎప్పుడైనా ఎస్‌ఓటీ పోలీసులు ఫాంహౌస్‌లపై దాడులు చేస్తేనే స్థానిక పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. మొయినాబాద్‌లోని ఫాంహౌస్‌లలో జరుగుతున్న కార్యకలాపాలపై, ఫాంహౌస్‌ల పట్ల స్థానిక పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కేసు నమోదు చేశాం

ఫాంహౌస్‌లలో డీజేలు పెట్టి న్యూసెన్స్ చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. ఆదివారం వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశాం. వీకెండ్స్ లో ఫాంహౌస్‌లలో తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఎక్కడ డీజేలు పెట్టినా వారిపై కేసులు నమోదు చేస్తాం.

– ముజఫర్ అలీ, ఎస్సై, మొయినాబాద్

ఆటల్లో ‘అమ్మ’ల సత్తా

- జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు, కాంస్య పతకాలు కైవసం


కాంస్య పతకం సాధించిన సంతోషికుమారి


బంగారు పతకం సాధించిన నవనీత

తాండూరు: జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో తాండూరుకు చెందిన ఇద్దరు అమ్మలు పతకాలు సాధించి సత్తా చాటారు. ఒకరు 35–40 వయస్సు కలిగిన విభాగంలో హై జంప్‌లో బంగారు పతకం, మరొకరు 45–50 వయస్సు విభాగంలో ట్రిపుల్ జంప్‌లో కాంస్య పతకాలను సాధించి మహిళలకు ఆదర్శంగా నిలిచారు. మాస్టర్ అథ్లెటిక్స్‌లో రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాలను సాధించడమే కాకుండా జాతీయ స్థాయిలో రాణించి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు.

అంతర్జాతీయ స్థాయికి..

తాండూరు పట్టణానికి చెందిన నవనీత 35–40 వయస్సు కలిగిన విభాగంలో హైజంప్‌లో రాష్ట్ర స్థాయి క్రీడాకారులను ఓడించి బంగారు పతకం సాధించారు. ఈమె పేద కుటుంబం నుంచి వచ్చి కష్టపడి చదువుకొంది. 2010 సంవత్సరంలో మహేష్ అనే వ్యక్తితో పెళ్లి నిర్వహించారు. ఆమెకు చదువుపై ఉన్న శ్రద్ధను గమనించిన భర్త పెళ్లైన తర్వాత కూడా చదివించాడు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఓ వైపు కుటుంబాన్ని చూసుకుంటునే ఆమె ఆటలపై ఉన్న ఆసక్తితో శిక్షణ తీసుకుంది. ప్రతిభకు పేదరికం అడ్డుకాదంటూ జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించి తోటి మహిళలకు ఆదర్శంగా నిలిచింది. త్వరలో నిర్వహించనున్న అంతర్జాతీయ పోటీలకు నవనీత ఎంపికైంది.

48 ఏళ్ల వయస్సులో..

తాండూరు పట్టణానికి చెందిన మంకాల్ సంతోషి కుమారి మాస్టర్ అథ్లెటిక్స్ జాతీయ పోటీల్లో ట్రిపుల్ జంప్‌లో విజయం సాధించి కాంస్యపతకం అందుకుంది. 45నుంచి 50 వయస్సు విభాగంలో 48 ఏళ్ల ఆమె గత నెల 4వ తేదీన గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఆదివారం త్రిశూర్ జిల్లాలో జరిగిన మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో విజయం సాధించి కాంస్యపతకం దక్కించుకున్నారు. సంతోషికి భర్త నటరాజ్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తాండూరు ప్రాంతానికి చెందిన ఇద్దరు మహిళలు మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో విజయం సాధించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

సినీ యూనియన్ నేతలపై దాడి

ముగ్గురిపై కేసు నమోదు

బంజారాహిల్స్: అకారణంగా యూనియన్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌పై దాడి చేసిన ముగ్గురు నాయకులపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..శ్రీకృష్ణానగర్‌లోని తెలుగు సినీ అండ్ టీవీ అవుట్‌డోర్ యూనియన్ ఎదుట ప్రెసిడెంట్, కెమెరా అసిస్టెంట్ సీహెచ్.కిషోర్‌బాబుతో పాటు వైస్ ప్రెసిడెంట్ ఎస్‌ఎల్‌వీఎస్ నారాయణ ఇతర సభ్యులతో కలిసి మాట్లాడుకుంటున్నారు. సమయంలో అక్కడికి వచ్చిన ట్రెజరర్ వంకినేని సురేష్, మాజీ అధ్యక్షుడు మెట్లు వెంకటేశ్వరరావు, జనరల్ సెక్రటరీ సయ్యద్ హుమాయున్ అలీ అకారణంగా వారితో గొడవ పడ్డారు. యూనియన్ ఆడిట్‌కు సంబంధించి మాట్లాడుతూనే వారు ఒక్కసారిగా కిషోర్‌బాబు, నారాయణపై దాడికి దిగారు. బాధితుడు కిషోర్‌బాబు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు వారిని వారిస్తున్నా వినకుండా పోలీసుల ఎదుటే కిషోర్‌బాబు, నారాయణలపై మరోమారు దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా దాడికి పాల్పడిన వంకినేని సురేష్ తెలుగు ఫిలిం ఫెడరేషన్‌లో కూడా ట్రెజరర్‌గా ఉన్నారు. సయ్యద్ హుమాయున్ అలీ 2009లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి ప్రజారాజ్యం పార్టీ తరుపున పోటీ చేసి ఓడిపోయారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కరాటే పోటీలో చిన్నారి సత్తా


జ్ఞానతేజకు గోల్డ్ మెడల్ అందజేస్తున్న నిర్వాహకులు

షాబాద్: కరాటే పోటీలో చిన్నారి జ్ఞానతేజ గోల్డ్ మెడల్ సాధించింది. మండల పరిధిలోని లక్ష్మారావుగూడ గ్రామానికి చెందిన మేకల విజయ్ శేఖర్, ప్రభావతి కూతురు జ్ఞానతేజ.. ఆదివారం విశాఖపట్నంలో జరిగిన ఓపెన్ శివ మొగ్గ 2025– 8వ ఇంటర్నేషనల్ స్థాయి కరాటే చాంపియన్‌షిప్‌లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచింది. జ్ఞానతేజ మొయినాబాద్ మండలంలోని సుజాత ఇంటర్నేషనల్ స్కూల్లో మూడో తరగతి చదువుతుంది. గ్లోవింగ్ షూట్ కాన్ కరాటే అకాడమీలో శిక్షణ తీసుకుంది. మాస్టర్ సింహాన్, సుధాకర్ చిన్నారికి తర్ఫీదు ఇచ్చారు. చిన్నారి గోల్డ్ మెడల్ సాధించడంతో పలువురు అభినందించారు.

యువతి అదృశ్యం..

సుభాష్‌నగర్: ఓ యువతి అదృశ్యమైన సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సాయిబాబానగర్‌లోని ఆర్‌వీ మోడల్ స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న శంకర్ కుమార్తె బాల అక్షయ(19) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. గత నెల 30న ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించినా ఆచూకీ తెలియరాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


బాల అక్షయ (ఫైల్)

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

బంట్వారం: నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న వ్యక్తిని వేగంగా వచ్చిన బైక్ ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ సంఘటన బంట్వారం మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీశైలం యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం. బంట్వారం గ్రామానికి చెందిన చాకలి కిష్టప్ప(63) పొలం నుంచి నడుచుకుంటూ ఇంటికి వెళుతున్నాడు. అదే సమయంలో నర్సింలు వ్యక్తి ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి కిష్టప్పను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కిష్టప్ప తలకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబీకులు వెంటనే తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నగరానికి తీసుకెళ్తుండగా మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

జాతీయ రహదారిపై రెండు కార్లు ఢీ

- ఆరుగురికి గాయాలు


ప్రమాద స్థలంలో వాహనాలను క్లియర్ చేస్తున్న పోలీసులు

పరిగి: హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారిపై రెండు కార్లు ఢీకొని ఆరుగురికి గాయాలైన సంఘటన పరిగి శివారులోని రాజాధాని దాబా సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాలకు చెందిన ఆరుగురు యువకులు హైదరాబాద్ నుంచి కొడంగల్ వైపు వెళ్తుండగా, కొడంగల్ నుంచి పరిగికి వెళ్తున్నా కారు ముందు ఉన్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. దీంతో కారులో ఉన్న ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం పరిగి ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణాపాయం సంభవించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు... సొంత భవనం కలేనా?


పాఠశాల భవనంలో కొనసాగుతున్న శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

- మూడేళ్లుగా పాఠశాల భవనంలోనే కొనసాగుతున్న కళాశాల
- సొంత భవనం లేనందున న్యాక్ గుర్తింపునకు దూరం
- ఏటా పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య

శంషాబాద్: విద్యార్థి సంఘాల పోరాటాలు.. వినతులు.. స్థానికుల డిమాండ్.. ప్రజా ప్రతినిధుల కృషితో 2022–23వ విద్యాసంవత్సరానికి గాను రాజేంద్రనగర్ (శంషాబాద్) ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రారంభైంది. అప్పటికప్పుడు మంజూరైన డిగ్రీ కళాశాలను పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన భవనంలో ఏర్పాటు చేశారు. ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న ఈ కళాశాలకు ఇప్పుడు సొంత భవనం లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది.

షిఫ్టుల వారీగా బోధన...

ప్రస్తుతం ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో మొత్తం 361 మంది విద్యార్థులు, ఆర్ట్స్, సైన్స్ కోర్సుల్లో విద్యను అభ్యసిస్తున్నారు. మొదటి సంవత్సరం స్వల్పంగా విద్యార్థులు ప్రవేశం పొందినా గత విద్యా సంవత్సరంతో పాటు ప్రస్తుత విద్యా సంవత్సరంలో డిగ్రీ కళాశాలలో విద్యార్థుల చేరిక పెరిగింది. ప్రస్తుతం పాఠశాలకు చెందిన 7 గదుల్లో రెండు షిఫ్టుల్లో విద్యాబోధన చేస్తున్నారు. ఉదయం ఆర్ట్స్, మధ్యాహ్నం తర్వాత సైన్స్ విద్యార్థులకు బోధిస్తున్నారు.

కేంద్ర నిధులకు దూరం...

సొంత భవనం ఉన్న డిగ్రీ కళాశాలకు మాత్రమే న్యాక్ గుర్తింపు లభిస్తుంది. దీంతో యూజీసీ గ్రాంట్స్ నిధులు అందుతాయి. న్యాక్ గుర్తింపు ఉన్న కళాశాలలకు రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ కింద కేంద్రం నిధులు విడుదల చేస్తుంది. న్యాక్ గుర్తింపు కావాలంటే కచ్చితంగా సొంత భవనాన్ని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అర్థాంతరంగా నిలిపివేసిన భవనాన్ని పూర్తి చేసి డిగ్రీ కళాశాలకు అందజేస్తే న్యాక్ గుర్తింపు కోసం వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. కళాశాలకు సొంత భవనం నిర్మించాలని ప్రభుత్వానికి కళాశాల తరపున ఇటీవల అనేక వినతులు సమర్పించారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా...



డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేస్తే శంషాబాద్ ఎడ్యుకేషన్ హబ్‌గా మారుతుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అర్థాంతరంగా నిలిపివేసిన భవనాన్ని పూర్తి చేసి అందజేస్తే బాగుంటుందని అధికారులకు.. ప్రజాప్రతినిధులకు వివరించాం. సొంత భవనంతో న్యాక్ గుర్తిపు వస్తుంది. తద్వారా కేంద్రం నుంచి కళాశాలకు కావల్సిన మేరకు నిధులు అందుతాయి. ప్రస్తుతం విద్యార్థు ల చేరిక కూడా పెరుగుతోంది. సొంతభవనం లేకపోవడంతో షిఫ్టుల వారిగా బోధన జరుగుతుంది. – డాక్టర్ రవీందర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్